క్లుప్తంగా

శాకంబరిగా కనకదుర్గమ్మ దర్శనం



శాకంబరిగా పత్తేబాద కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఆషాఢమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా స్థానిక పత్తేబాద కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు చేశారు. లలితా సహస్రనామ పారాయణ చేసి, మణిద్వీప వర్ణన పారాయణ నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బీహెచ్ రామనాగ శంకర్, ట్రస్టీలు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు పర్యవేక్షించారు.

25న బీకేఎంయూ జిల్లా మహాసభ

ఏలూరు (టూటౌన్): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు పేదలు, వ్యవసాయ కార్మికులతో ప్రదర్శన, 11 గంటలకు ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో మహాసభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహాసభకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా వెంకటేశ్వరరావు కోరారు.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి

ఏలూరు (టూటౌన్): రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెల 21న ఏలూరులో నిర్వహించే జిల్లా, 30న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సులను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చింది. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.శ్రీనివాస్ అధ్యక్షతన ఎస్‌కేఎం జిల్లా సమావేశం నిర్వహించారు. రైతాంగ సమస్యలపై చర్చించి కార్యాచరణ కార్యక్రమాలను రూపొందించారు. నాయకులు కె.శ్రీనివాస్, ఎస్‌కే గౌస్, బండి వెంకటేశ్వరరావు, ఎస్‌కే బాషా, రాజనాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేం

సర్వత్రా హర్షం

వలంటీర్లకు వందనం

ఏలూరు రూరల్: వలంటీర్ల సేవలు వెలకట్టలేమని ఏలూరు మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు అందజేస్తున్నారని కొనియాడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ అందించి ఆదుకుంటున్నారని చెబుతున్నారు. కరోన సమయంలో వైద్య పరీక్షలు చేయించారని, క్వారంటైన్ సమయంలో నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్నారని గుర్తుచేసుకుంటున్నారు.

ఏలూరు మండలంలో..	
వలంటీర్లు	198
సచివాలయాలు	11
గ్రామ పంచాయతీలు	15



కరోన సమయంలో చొదిమెళ్లలో కూరగాయలు అందిస్తున్న వలంటీర్



చొదిమెళ్లలో వృద్ధురాలకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్

వలంటీర్ సేవలు భేష్



గతంలో ఇంటి స్థలం కోసం అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. వలంటీర్లు వచ్చిన తర్వాతే మాకు ప్రభుత్వ పథకాలు వచ్చాయి. మా వలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు పూర్తి చేయించింది. ఇంటి స్థలం మంజూరు చేయించింది. ఒక్క పైసా కూడా అడగలేదు. మా ఇంటి గృహప్రవేశం రోజు వలంటీర్‌ను పిలిచి భోజనం పెట్టాం. బంధువులు సైతం వలంటీర్ వలె సాయం చేయరు.

– ఎం నాగేశ్వరమ్మ, శనివారపుపేట

మా కుటుంబ సభ్యుడే



వలంటీర్ మా కుటుంబ సభ్యుడే. సంక్షేమ పథకాల గూర్చి మొట్టమొదట మాకు చెప్పేది మా వలంటీరే. ఇంటి స్థలం వచ్చింది. ఫించన్ ఇస్తోంది. మా మనవరాళ్లకు అమ్మఒడి వచ్చేలా చేసింది. ఇంత కన్నా ఏం కావాలి. అయినవాళ్లు సైతం మేలు చేయరు. మా కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగిన తప్పకుండా వలంటీర్‌ను బంధువులా పిలుస్తాం. వలంటీర్ గురించి తెలియని వాళ్లే తప్పుడు మాటలు మాట్లాడుతారు.

– చొదిమెళ్ల నాగమణి, మల్కాపురం

జగన్ ఇచ్చిన కానుక



మా వలంటీర్ భవాని, జగన్ ఇచ్చిన కానుక. నా కుటుంబంలో వ్యక్తిగానే బావిస్తాను. నాకు ఏ కష్టం వచ్చినా సాయం చేస్తుంది. ఫోన్ చేస్తే చాలు ఇంటికి వచ్చి ఏం కావాలి అంటుంది. నెల నెలా 1వ తేదీన పింఛన్ ఇస్తుంది. ఒకరోజు కూడా ఆలస్యం చేయదు. నా వల్ల మీరు ఏ సమస్యలు పడకూడదంటుంది. నేను ఆ డబ్బుతోనే మందులు కొనుక్కుంటానని తెలుసు.

– చందులూరి గంగాభవాని, శనివారపుపేట



ఏఆర్, హోంగార్డుల కవాతు



ఏఆర్, హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీస్ సిబ్బంది, హోంగార్డుల కవాతును ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పరిశీలించారు. శుక్రవారం ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మూడు విభాగాలకు చెందిన సిబ్బంది కవాతు చేయగా జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రశాంతి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం నిమగ్నమయ్యే పోలీసులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. వ్యాయామం, యోగ ప్రతి రోజూ చేయాలని సూచించారు. సిబ్బంది తమ ఆరోగ్య పరిరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి సంక్షేమ దివస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ సిబ్బందికి శాఖాపరమైన అంశాల్లో సమస్యలు ఉంటే సంక్షేమ దివస్‌లో తమ దృష్టి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో 2022 – 23లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని ఏపీఓ కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది ఈ నెల 13 నుంచి 17 వరకు గ్రామాల్లో సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తయిన పనులపై ప్రజలు, స్థానిక సంస్థల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 18న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజల సమక్షంలో పబ్లిక్ హియరింగ్ చేపడతామన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా 1,167 పనుల పూర్తి చేశామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.11,95,74,842 ఖర్చు పెట్టిందని వివరించారు. ఈ పనులపై సోషల్ ఆడిట్ అధికారులు, సిబ్బంది సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

మహిళల భద్రత కోసం ఉద్యమం



ఉద్యమ వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలపై జరిగే దాడులు, అనైతిక చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మహిళల భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహించనున్నట్టు జమాతే ఇస్లామి హింద్ ఏలూరు అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, మహిళా విభాగం అధ్యక్షురాలు జుబేదా ఖతూన్ తెలిపారు. ఈ మేరకు ఉద్యమ వాల్ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక తంగెళ్లమూడి నెహర్ మజీదులో వారు విడుదల చేశారు. అశ్లీలం, వరకట్నం, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలపై మహిళల్ని చైతన్యవంతులను చేస్తామన్నారు. ప్రతి ఒక్కరిలోనూ నైతిక చైతన్యంతోనే మార్పు సాధ్యపడుతుందని తెలిపడానికి గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఛేంజ్ (బిఫోర్ లైఫ్ ఎండ్స్) నినాదంతో ఈ నెల 23 వరకూ ఉద్యమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనేక జాగృతి కార్యక్రమాలు చేపడతామని గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఏలూరు శాఖ అధ్యక్షురాలు నాఫియ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌ఆర్‌పేట ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ టి.శిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రరావు పేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు, విద్యుత్ భవన్ వెనక రోడ్డు, మాగంటి వారి వీధి ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

హాస్టల్‌లో రాత్రి బస.. సౌకర్యాలపై ఆరా





వంట గదిలో ఆహార పదార్థాల తయారీ, నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్, బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: స్థానిక పవర్‌పేట బీసీ బాలుర హాస్టల్‌లో ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ రాత్రి బస చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలుడి దారుణ హత్య నేపథ్యంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక పర్యవేక్షణకు జిల్లా అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది. అధికారులు ప్రభుత్వ హాస్టల్స్‌లో రాత్రి బస చేస్తున్నారు. పవర్‌పేటలోని బాలుర బీసీ హాస్టల్‌కు శుక్రవారం సాయంత్రం వెళ్లిన నగర కమిషనర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట గదిలో ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లు నిర్వహణపై హాస్టల్ సిబ్బందిని నిలదీశారు. హాస్టల్‌లో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏలూరు నగర కమిషనర్ రాత్రి హాస్టల్‌లోనే విద్యార్థులతో కలిసి నిద్రించేలా చర్యలు తీసుకున్నారు.

దాతల చేయూత అభినందనీయం



పాతూరులో చిన్నారులకు అభ్యసనానికి సామగ్రిని అందిస్తున్న దాత పల్లా త్రినాథరావు, పెద్దలు

భీమడోలు: ప్రభుత్వ సహకారానికి తోడు దాతలు చేయూత నివ్వడం మరవలేనిదని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులోని ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పల్లా ఆదినారాయణ జ్ఞాపకార్థం ఆయన తనయుడు, ప్రముఖ న్యాయవాది పల్లా త్రినాథరావు రూ.25 వేల విలువ చేసే బీరువాను బహూకరించారు. అదే పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారులకు అభ్యసనా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్ఎం పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. దాత, న్యాయవాది పల్లా త్రినాథరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కారీ బడుల్లో చదువుకుంటున్న చిన్నారులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పాఠశాలలకు నాడు– నేడు పథకం ద్వారా రూ.లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం చాలా సంతోషమన్నారు. దాతలు మరింత మంది ముందుకు వచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. టీచర్ మండే సుధాకర్, నాయకులు వెజ్జు అన్నవరం, పెద్దలు చప్పిడి సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ సభ్యులు షేక్ భాషా, వెసూర్యప్రకాష్, మామిడి బాలాజీ, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వట్లూరు డ్రెయిన్ పరిశీలన

పెదపాడు: మండలంలోని వట్లూరు ఎస్సీ ఏరియాలోని మురుగు డ్రెయిన్‌ను జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు శుక్రవారం పరిశీలించారు. గతంలో అండర్ గ్రౌండ్ డ్రెయిన్ ఏర్పాటు చేశారని అయితే సక్రమంగా లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారంటూ పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆ డ్రెయిన్‌ను స్థానే ఓపెన్ కాంక్రీటు డ్రెయిన్‌ను నిర్మాణం చేయాల్సిన అవసరముందని, ఇందుకు గాను రూ.25లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. 2 కిలోమీటర్ల మేర నిర్మాణం చేయాల్సి ఉందని డ్రెయిన్ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని సతీష్ చౌదరి కోరారు. దీంతో తమ వంతు సహకారం అందిస్తామని ప్రసాదరావు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	98	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	76-84	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-64	కీరా దోస	44
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	188-260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	20	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	104
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	20
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

268 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

దెందులూరు: జగనన్న సురక్ష పథకం కార్యక్రమం ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే బృహత్తర కార్యక్రమని ప్రత్యేకాధికారి ఎస్ఎన్ కృపావరం అన్నారు. శుక్రవారం మేధినరావు పాలెంలో సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 268 ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు సర్పంచ్ దుర్గాకుమారి రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చల్లా మేరి రాజు, కట్టా ఏసుబాబు, అధికారులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు.

వ్యాయామ కళాశాలలో హాస్టల్ నిర్మాణం

దెందులూరు: రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ వ్యాయామ కళాశాలకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో రూ. కోటితో బాలుర హాస్టల్ భవనం నిర్మిస్తున్నారు. శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏకైక వ్యాయామ కళాశాల అయిన గోపన్నపాలెం కళాశాలలో హాస్టల్ భవనం లేక బీపీఏడీ, డీపీఏడీ విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారన్నారు. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారన్నారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ప్రిన్సిపల్ వివరించారు.

పేదల సొంతింటి కల సాకారం దిశగా సీఎం జగన్ కృషి



పెదనిండ్రకొలనులో స్థల పట్టాలు అందిస్తున్న వాసుబాబు

నిడమర్రు: అర్హత ఉన్న ప్రతి పేదవాడు సొంతింటి కల నెరవేర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం పెదనిండ్రకొలనులో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 142 ఇంటి స్థల పట్టాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగనన్న కాలనీల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటి స్థలం పట్టా పొందిన వారు ప్రభుత్వ ప్రోత్సాహంతో తక్షణం ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, వైసీపీ మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు, వైసీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, వైఎస్ ఎంపీపీ బండి రమణ, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహామూర్తి, తహసీల్దారు బి. సాయిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, దళిత మహాసభ కార్యదర్శి బాబూరావు తదితరులున్నారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: చెరుకు పంటను ధ్వంసం చేసినట్లు బాధితుడు నిజాపరపు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.సాగర్ బాబు తెలిపారు. చిన్నవారిగూడెంకు చెందిన నిజాపరపు దుర్గారావుకు గ్రామంలో పొలం ఉంది. పొలంలోని చెరుకును అదే గ్రామానికి చెందిన తిరుమలశెట్టి చిన్న నాగేశ్వరరావు, రాంబాబు, తిరుమలశెట్టి ప్రసాద్‌లు దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నివేశారన్నారు. దుర్గారావు పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ తన మీదకు ఎక్కించి వెళ్లిపోతామని బెదిరించారన్నారన్నారు. గతంలోనే ఇదేవిధంగా పొలంలో కలుపు మందు కొట్టి పంటను నాశనం చేశారన్నారు. దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు తిమ్మాపురంలో జగనన్న సురక్ష

ద్వారకాతిరుమల: తిమ్మాపురం సచివాలయం వద్ద శనివారం ఉదయం 11 గంటల నుంచి అమ్మఒడి, జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొంటారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.